క్లుప్తంగా

పాఠశాల వరండాలోనే అంగన్‌వాడీ కేంద్రం



ప్రాథమిక పాఠశాల వరండాలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్న దృశ్యం

తాళ్లరేవు: మండలంలోని పలు చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు లేకపోవడంతో సిబ్బంది, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని జి.వేమవరం పంచాయతీలోని గండివారి పాలెం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి భవనం లేకపోవడంతో స్థానిక ప్రాథమిక పాఠశాల వరండాలోనే సేవలు నిర్వహిస్తున్నారు. అక్కడే విద్యార్థులకు వంటా వార్పుతో పాటు తరగతులు నిర్వహిస్తున్నారు. వీలైనంత త్వరగా అంగన్‌వాడీ కేంద్రానికి భవనం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

సర్వే ఉద్యోగుల సంఘం ఆవిర్భావ దినోత్సవం



పట్టాభిరామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సర్వేయర్లు

ముమ్మిడివరం: సర్వే ఉద్యోగుల సంఘ ఆవిర్భావ దినోత్సవం జిల్లా సర్వే కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేయర్ల సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు జి.పట్టాభిరామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్వే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పట్టాభిరామయ్య చేసిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజేషన్ కార్యదర్శి దాసరి సాయిబాబు, జిల్లా అధ్యక్షుడు కె.ప్రభాకరరావు, ఏపీఎస్ఈ ఉపాధ్యక్షుడు రామకృష్ణ, ఎం.శ్రీహర్ష, జె.చాందినీదేవి, బి.ఉమాశంకర్, పి.శ్రీరామ్, సూర్యతేజ, కె.బాలవెంకట్ తదితరులు పాల్గొన్నారు.

14న బీఎస్సీ నర్సింగ్ ప్రవేశ పరీక్ష

యానాం: డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ సర్వీస్(డీహెచ్ఎఫ్‌డబ్ల్యూఎస్) పుదుచ్చేరి ఆధ్వర్యంలో బీఎస్సీ నర్సింగ్ కోర్సులో అడ్మిషన్లకు గాను ఈ నెల 14న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు డైరెక్టర్ కమ్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ జి.శ్రీరాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెంటాక్ ప్రభుత్వ కోటా సీట్ల కోసం నిర్వహించే ఈ పరీక్ష యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ రీజియన్లలో మొత్తంగా ఐదు పరీక్షా కేంద్రాల్లో జరుగుతుందన్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను 'సెంటాక్‌పుదుచ్చేరి.ఇన్' వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 10వ తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 0413–2229355 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

వీరేశ్వరుని నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం



దాత ఏడుకొండలు దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారి

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వర స్వామివారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ముమ్మిడివరానికి చెందిన భక్తుడు నలమాటి ఏడుకొండలు, వీరలక్ష్మి దంపతులు రూ.10 వేలు విరాళంగా ఇచ్చారు. ఆలయం వద్ద మంగళవారం ఆలయ పర్యవేక్షణాధికారి బి.వీరభద్రరావుకు విరాళాన్ని అందజేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ దాతను అభినందించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

అధ్వానంగా తోటపేట రహదారి



గోతులతో అధ్వానంగా తయారైన తోటపేట కాలువ గట్టు రహదారి

తాళ్లరేవు: పోలేకుర్రు గ్రామ పంచాయతీ పరిధిలోని తోటపేట గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. మండల కేంద్రం తాళ్లరేవు నుంచి ఈ రహదారి మీదుగానే గ్రామస్తులు రాకపోకలు సాగిస్తుంటారు. గోతులు, గొప్పులతో ప్రయాణం నరకప్రాయమైందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. వర్షం వచ్చిందంటే చాలు గోతుల్లో నీరు నిలిచిపోయి ప్రమాదకరంగా మారుతోంది. కాలువ గట్టు చెంతన కావడంతో వాహనదారులు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షం వచ్చినప్పుడల్లా పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

వలకట్లే ముంచేస్తున్నాయ్

- డ్రెయిన్లలో వలకట్లతో నీరు దిగక ముంపులోనే పొలాలు
- నియంత్రణపై ఉదాసీనంగా వ్యవహరిస్తున్న అధికారులు



కొడప వద్ద పంచనీటి కాలువపై ఏర్పాటుచేసిన వలకట్టు



అల్లవరంలో నీరు దిగువకు వెళ్లక ముంపులో ఉండిపోయిన నారుమడి

అల్లవరం: అల్పపీడనాల ప్రభావంతో తీరం వెంబడి అధిక వర్షాలు కురవడంతో అమలాపురం నియోజకవర్గ వ్యాప్తంగా పొలాలకు ముంపు ముప్పు తప్పడం లేదు. అయితే ముంపు నీరు దిగే ప్రధాన డ్రెయిన్లు లోయర్ కౌశిక, వాసాలతిప్ప, దేశికోడు, మైనర్, రెవెన్యూ డ్రెయిన్‌లు ఆక్రమణకు గురి కావడం, పూర్తి స్థాయిలో ఆధునీకరణకు నోచుకోకపోవడం కూడా రైతు పాలిట శాపంగా మారింది. వీటికి తోడు ప్రధాన డ్రెయిన్లో వలకట్లు ముంపు నీరు దిగేందుకు ప్రతిబంధకంగా మారుతున్నాయి. కొందరు మత్స్యకారులు చేపల కోసం ఏర్పాటుచేస్తున్న వలకట్లు వేలాది ఎకరాల పంట మునకకు కారణమవుతున్నాయి.

వేల ఎకరాలకు ముంపు బెడద

అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లోని సుమారు 22 వేల ఎకరాల్లోని వరి క్షేత్రాల్లో ముంపు నీరు లోయర్ కౌశిక, కుమ్మరికాలువ, దేశికోడు, పంచనీటి డ్రెయిన్ల ద్వారా సముద్రానికి చేరవలసి ఉంది. అయినవిల్లి, అమలాపురం, అల్లవరం మండలాల నుంచి వచ్చి చేరుతున్న ముంపు నీరు వాసాలతిప్ప డ్రెయిన్‌లోకి చేరి అక్కడ నుంచి తీరం వెంబడి ఉన్న నదీ పాయ గుండా సముద్రంలోకి చేరుతుంది. అయితే ఇదంతా సవ్యంగా ఉంటే ముంపు బెడదే ఉండదు. వాసాలతిప్ప, లోయర్ కౌశిక, పంచనీటి కాలువ పొడవునా మత్స్యకారులు వలకట్లు ఏర్పాటు చేయడంతో ముంపు నీరు కిందకు దిగడం లేదు. డ్రెయిన్లలో ఏర్పాటుచేసిన వలకట్లకు ప్లాస్టిక్ బరకాలు అమర్చి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నారు. దీంతో ప్రధాన డ్రెయిన్లో ముంపునీరు స్తంభించిపోయి వేలాది ఎకరాలు ముంపులో చిక్కుకుంటున్నాయి. పంచనీటి కాలువపై కొమరగిరిపట్నంలో రెండు, ఓడలరేవులో ఒకటి, ఎస్.రామేశ్వరంలో ఒకటి, లోయర్‌కౌశికపై గుండెపూడిలో ఒకటి, వాసాలతిప్ప డ్రెయిన్‌పై సామంతకుర్రులో రెండు, ఎస్.పల్లిపాలెంలో ఒకటి చొప్పున వలకట్లు ఏర్పాటుచేశారు. వలకట్ల ఏర్పాటుతో చేపల బాగా లభిస్తాయన్న ఉద్దేశంతో ప్లాస్టిక్ బరకాలు అమర్చుతున్నారు. అయితే మత్స్యకారులు ఏర్పాటుచేస్తున్న వలకట్ల ప్రభావంతో ఎగువ నుంచి వస్తున్న ముంపునీటిని సముద్రానికి వెళ్లకుండా వలకట్లు అడ్డుకుంటున్నాయి. దీంతో ముంపు నీరు దిగువకు వెళ్లక వేలాది ఎకరాల పంట పాడై రైతులకు కన్నీళ్లని మిగుల్చుతున్నాయి.

నిబంధనలను పట్టించుకోని అధికారులు

ప్రధాన డ్రెయిన్లో నీటి ప్రవాహాన్ని అడ్డుకునేలా వలకట్లు ఏర్పాటుచేయడానికి వీల్లేదని నిబంధనలు ఉన్నా కొందరు మత్స్యకారులు మాత్రం అవేమి తమకు వర్తించవు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు డ్రెయిన్ అధికారులకు అంతా తెలిసినా తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రధాన డ్రెయిన్లో వలకట్లు ఏర్పాటు చేయకుండా మత్స్యకారులను నిలువరించలేకపోతున్నారు. రెవెన్యూ, మత్స్య, డ్రెయిన్ అధికారులను సమన్వయపరచి ఖరీఫ్ పంట కాలంలో(జూన్ నుంచి నవంబర్) వరకూ నీటి ప్రవాహాన్ని అడ్డుకునేలా వలకట్లు వేయకుండా అధికారులు కఠినంగా వ్యవహరిస్తే ఖరీఫ్‌లో ముంపు బెడద తప్పుతుందని రైతులు సూచిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

> **వలకట్లను తొలగిస్తాం**
>
> 
>
> ప్రధాన డ్రెయిన్లో వలకట్లు ఉన్నాయని మా దృష్టికి వచ్చింది. దీనిపై డ్రెయిన్, మత్స్యశాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ఎక్కడెక్కడ వలకట్లు ఉన్నాయో గుర్తించి పోలీసుల సహకారంతో వాటిని తొలగిస్తాం. ఖరీఫ్‌లో వలకట్లు వేయకుండా నిర్వాహకులకు నోటీసులు జారీ చేస్తాం.
>
> – పి.సునీల్‌కుమార్, తహసీల్దార్, అల్లవరం

జులై 15 నుంచి పాఠశాల వేళల్లో మార్పు

యానాం: యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ రీజియన్లలో సీబీఎస్ఈ కరిక్యులమ్ అమలు చేస్తున్న నేపథ్యంలో ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకూ ప్రభుత్వ పాఠశాలల సమయవేళల్లో మార్పులు చేసినట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ప్రియదర్శిని మంగళవారం తెలిపారు. అన్ని పాఠశాలలు రోజూ అరగంట ముందుగా అంటే ఉదయం 9 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4.20 గంటలకు ముగుస్తాయన్నారు. సీబీఎస్ఈ సిలబస్ ప్రకారం 8 పీరియడ్లు నిర్వహించాల్సిన ఉన్న నేపథ్యంలో ఈ మార్పు చేసినట్లు ప్రకటించారు. జులై 15 నుంచి మారిన సమయ వేళలు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన బ్రహ్మకుమారీస్



కలెక్టర్ మహేష్‌కుమార్‌కు జ్ఞాపిక అందజేసి సత్కరిస్తున్న బ్రహ్మకుమారీస్

అమలాపురం రూరల్: నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రావిరాల మహేష్‌కుమార్‌ను కోనసీమ బ్రహ్మ కుమారీస్ ఇన్‌చార్జి బీకే శ్రీదేవి, బీకే స్వరూప మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్ కుమార్‌కు జ్ఞాపిక అందజేసి సత్కరించారు. ప్రజలు మానసిక ప్రశాంతత వైపు అడుగులు వేసేలా సేవలు అందిస్తున్నామని కలెక్టర్‌కు శ్రీదేవి వివరించారు.

పనుల్లో నాణ్యత కొరవడితే సహించేది లేదు

- ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్
- ఎమ్మెల్యే ల్యాడ్ అభివృద్ధి పనుల పరిశీలన



రాజీవ్ రివర్ బీచ్‌లో పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

యానాం: నియోజకవర్గంలో కోట్లాది రూపాయల ఎమ్మెల్యే ల్యాడ్ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత కొరవడితే సహించేది లేదని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన చెల్లే గార్డెన్స్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. తమ ప్రాంతంలో రహదారి లేక వర్షాలు, వరదల సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అబ్దుల్‌కలామ్ నగర్ మహిళలు ఎమ్మెల్యే అశోక్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన ఆయన ఎమ్మెల్యే ల్యాడ్ నిధులు మంజూరు చేసి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నిత్యం వందలాది మంది సందర్శకులతో కిటకిటలాడే రాజీవ్ రివర్‌బీచ్‌లో వరద ఉధృతికి గురికాకుండా శివమ్‌బాత్ నుంచి జీసెస్ స్టాట్యూ వరకూ చేపడుతున్న పనులపై పీడబ్ల్యూడీ ఇంజినీర్లకు ఎమ్మెల్యే అశోక్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పీడబ్ల్యూడీ ఈఈ చంద్రశేఖరన్, ఏఈ కాళ్ల నాగరాజు, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

రిసార్ట్‌లలో అధికారుల తనిఖీలు



అరటికాయలంక రిసార్ట్‌లలో తనిఖీలు చేస్తున్న కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిషోర్ తదితరులు

తాళ్లరేవు: మండల పరిధిలోని ఇంజరం పంచాయతీ అరటికాయలంక గ్రామంలో రెవెన్యూ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. వృద్ధ గౌతమీ గోదావరిని ఆనుకుని నిబంధనలకు విరుద్ధంగా యానాం రిసార్టులు నిర్మించారని అందిన ఫిర్యాదు మేరకు జిల్లా రెవెన్యూ అధికారులు తనిఖీలు చేపట్టారు. గోదావరి చెంతన నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన నిర్మాణాలను కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిషోర్, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఆర్ఐ సాయితేజ, సర్వేయర్ షఫీ, వీఆర్ఓ సత్యనారాయణ పరిశీలించారు. రిసార్ట్‌లలో నిర్మించిన భవనాలు సైతం ప్లాన్‌కు అనుబంధంగా లేవని గుర్తించారు. ఈ మేరకు సంబంధిత రికార్డులన్నింటినీ పరిశీలించి తగు చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

డిగ్రీ కళాశాలలో బీకాం జనరల్ కోర్సును కొనసాగించాలి

ఆలమూరు: రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కళాశాలల్లో బీకాం జనరల్ కోర్సులను కొనసాగించి విద్యార్థుల హక్కులను పరిరక్షించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రవికుమార్ డిమాండ్ చేశారు. ఆలమూరులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకున్న విద్యార్థులు డిగ్రీ చేరేందుకు వీలుగా ప్రభుత్వం వెలువరించిన నోటిఫికేషన్‌లో బీకాం కోర్సులు రద్దు చేస్తున్నట్లు తీసుకున్న నిర్ణయం సమంజసంగా లేదన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే బీకాం కోర్సుల రద్దుపై తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ కోర్సు చదవడానికి శ్రద్ధ చూపుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం జనరల్ కోర్స్ తొలగిస్తున్నట్లు ప్రకటించినా ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో బీకాం జనరల్ కోర్సును కొనసాగించడం ద్వంద్వ నీతికి నిదర్శనమని దుయ్యబట్టారు. ఈనిర్ణయాల వల్ల భవిష్యత్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు మూతపడే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సత్వరమే స్పందించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కూడా బీకాం జనరల్ కోర్సును కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 10 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియలో బీకాం జనరల్ కోర్సులకు ప్రవేశాలకు అనుమతించాలని లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భారీ ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.

రోడ్డుకు మరమ్మతులు నిర్వహించండి



అధ్వానంగా మారిన అప్పనపల్లి ఆర్అండ్‌బీ రోడ్డు



కొద్దిపాటి వర్షానికే చిత్తడిగా మారిన కొత్తూరు–వెదురుమూడి రోడ్డు

మామిడికుదురు: పాశర్లపూడి కరకట్ట దిగువ నుంచి బి.దొడ్డవరం మీదుగా పెదపట్నంలంక వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు పడి ఆ గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోయి ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఒక మాదిరి వర్షం కురిసినా ఇబ్బందులు తప్పడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయానికి నిత్యం అనేక మంది భక్తులు వస్తున్నారు. భక్తులకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. బి.దొడ్డవరం నుంచి పెదపట్నంలంక వెళ్లే రోడ్డు పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. పాశర్లపూడి నుంచి అప్పనపల్లి వరకు ఆర్అండ్‌బీ రోడ్డు కొంత మేర అభివృద్ధికి నోచుకున్నా పూర్తి స్థాయిలో అభివృద్ధి జరగలేదు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ రోడ్డు ఆధునీకరణపై దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

చిరుజల్లులతో చిత్తడి చిత్తడి

ఆలమూరు: నైరుతి పవనాల దృష్ట్యా వాతావరణంలో సంభవించిన మార్పుల కారణంగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాల ప్రభావం వల్ల మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రధాన రహదారులన్నీ చిత్తడిగా మారిపోయాయి. దీంతో వాహనదారులు ఎక్కడ జారి పడతామేమోనని ఆందోళన చెందుతున్నారు. పాదచారులైన కనీసం అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి. ఇటీవల కొత్తూరు–వెదురుమూడి రోడ్డులో మరమ్మతులను ప్రారంభించినా మళ్లీ ఆపివేయడం వల్ల అస్తవ్యస్తంగా తయారైంది. రాత్రి వేళల్లో ఈ రహదారిపై ప్రయాణం చేసేందుకు భయాందోళన చెందుతున్నారు. వర్షాకాలం దృష్ట్యా మండలంలోని వివిధ రహదారులకు ఇరువైపులా పెరిగిపోయిన చెత్త చెదారాన్ని తొలగించి బెర్మ్‌లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారుల మరమ్మతులు చేస్తామని ఇచ్చిన హామీ నిలబెట్టుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులు సత్వరమే స్పందించి త్వరితగతిన మరమ్మతులు పూర్తి చేసి భవిష్యత్‌లో పూర్తి స్థాయిలో పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మాసోత్సవాలతో డెంగీపై అవగాహన



చొప్పెల్లలో పీహెచ్‌సీలో డెంగీ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్యశాఖ

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పి డెంగీ వంటి వ్యాధులను పూర్తిగా నిర్మూలించాలని గ్రామీణ ప్రాంతాల్లోని వివిధ ముఖ్య కూడళ్లలో ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి కోరారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా పీహెచ్‌సీలతో పాటు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల్లో మంగళవారం భారీ ర్యాలీలు నిర్వహించారు. ఈనెల ఒకటి నుంచి ప్రారంభించి 31 వరకూ కొనసాగనున్న నిర్వహించే డెంగీ వ్యాధి వ్యతిరేక మాసోత్సవాల ఆవశ్యకతను ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్ బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

సర్క్యులర్ బజార్‌లోనే రిజర్వేషన్ కౌంటర్ కొనసాగించాలి

అంబాజీపేట: అమలాపురం సర్క్యులర్ బజార్‌లో ఏర్పాటు చేసిన రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను యథాస్థానంలో కొనసాగించాలని కోనసీమ కన్స్యూమర్స్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ (కోకోఫెడ్) చైర్మన్ అరిగెల బలరామమూర్తి కోరారు. దీనికి సంబంధించి అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. బలరామమూర్తి మాట్లాడుతూ గతంలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ సర్క్యులర్ బజార్‌లో ఉండేదని అనంతరం స్థానిక హెడ్ పోస్టాఫీస్‌కు తరలించారన్నారు. దీని వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. స్థానిక మునిసిపాలిటీ అద్దె లేకుండా బజార్‌లోని పాత దుకాణాలను ఇచ్చేందుకు అంగీకరించిందన్నారు.

నీట మునిగిన ఆకుమడులు

రాజోలు: గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో వరి నారు మడులు ముంపునకు గురయ్యాయి. మంగళవారం మండల వ్యవసాయాధికారి వై.మధుకుమార్ ఆధ్వర్యంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వరినారుమడులను పరిశీలించారు. కాట్రేనిపాడు, పొన్నమండ, కూనవరం, ములికిపల్లి, కడలి గ్రామాల్లో నారుమడులు పూర్తిగా నీటమునిగి పోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆకుమడులు వేసిన వరి చేలు చెరువులను తలపిస్తున్నాయి. ముంపునీరు దిగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ముంపు నీటి నుంచి వరినారుమడులను రక్షించుకునేందుకు వ్యవసాయాధికారులు రైతులకు సూచనలు చేశారు. ముంపునీరు బయటకు వెళ్లేందుకు మార్గాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నీటమునిగి నారుమడిలో ఐదు సెంట్ల విస్తీర్ణానికి రెండు నుంచి మూడు కేజీల యూరియా, రెండు కేజీల పొటాష్, ఒక కేజీ సూపర్ ఎరువు వేయాలన్నారు. అలాగే బూజు తెగుళ్లు సోకకుండా 10 మిల్లీ లీటర్ల ప్రొపికోనాజోల్(టిల్ట్) మందును 50 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

54 మందికి కంటి వైద్య పరీక్షలు

పి.గన్నవరం: ముంగండలోని మంత్రవాది ఇందిరా కుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి సిబ్బంది కంటి పరీక్షలు చేశారు. మొత్తం 54 మందికి కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వారిలో 12 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసేందుకు నిర్ధారించారు. కార్యక్రమానికి హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యం వహించారు.

ఎరువుల షాపుల్లో తనిఖీలు



ములికిపల్లిలో ఎరువుల షాపు వద్ద తూకం తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

రాజోలు: రైతులకు విక్రయించే ఎరువులు, విత్తనాల బస్తాల తూకంలో మోసం చేస్తే చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఏడీఏ ఎల్‌వీ మధు అన్నారు. మంగళవారం మండలంలోని ములికిపల్లి, మలికిపురం మండలం లక్కవరం గ్రామాల్లోని ఎరువుల షాపుల్లో రికార్డులను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి వివరాలను నమోదు చేసుకున్నారు. రైతులకు విక్రయించిన ఎరువుల బస్తాలను స్వయంగా తూకం వేసి పరిశీలించారు. విజిలెన్స్ ఏడీఏ మధు మాట్లాడుతూ రైతులకు కొనుగోలు చేసే ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు తదితర వస్తువుల విషయంలో ఎలాంటి మోసాలకు పాల్పడినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. విజిలెన్స్ సీఐ ఎస్.లక్ష్మాజీ, ఏవో వై.మధుకుమార్ పాల్గొన్నారు.

ఫోన్ చేతబట్టి.. విద్యుత్ బిల్లు కట్టి

- విద్యుత్ బిల్లుల చెల్లింపులో కొత్త నిబంధనలు
- ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం యాప్‌ల్లో బిల్లుల చెల్లింపునకు స్వస్తి
- ఈస్ట్రన్ పవర్ మొబైల్ యాప్, వెబ్‌సైట్ సిద్ధం



ఈస్ట్రన్ పవర్ మొబైల్ యాప్



ఉప్పలగుప్తం సబ్‌స్టేషన్‌లో సిబ్బందికి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఏఈఈ శ్రీహరి

ఉప్పలగుప్తం: కొన్నేళ్ల క్రితం విద్యుత్ బిల్లులను చెల్లించాలంటే దగ్గరలో ఉన్న విద్యుత్ అధికారుల కార్యాలయం వద్దకు వెళ్లి బారులు తీరి నిలబడి గంటల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. తరువాత కొన్నాళ్లకు మీ–సేవ, ఈ–సేవ కార్యాలయాల్లో చెల్లించేవారు. అనంతరం ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం మొబైల్ యాప్‌ల ద్వారా నేరుగా బిల్లులు చెల్లించేవాళ్లం. ఇకపై థర్డ్ పార్టీ యాప్‌లైన ఫోన్‌పే, పేటీఎం, గూగుల్‌పే తదితర యూపీఐ యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లింపులకు ఏపీఈపీడీసీఎల్ స్వస్తి పలికింది. ఇక నుంచి కేవలం ఏపీఈపీడీసీఎల్(ఆంధ్రప్రదేశ్ ఈస్ట్రన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్) వెబ్ సైట్, ఈస్ట్రన్ పవర్ మొబైల్ యాప్‌ల ద్వారా మాత్రమే విద్యుత్ బిల్లులు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. దీనికోసం ఈస్ట్రన్ పవర్డ్ మొబైల్ యాప్‌ను సిద్ధం చేసింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) కొత్త నిబంధనల నేపథ్యంలో ఇకపై ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్, యాప్ ద్వారా మాత్రమే విద్యుత్ బిల్లులు చెల్లించాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులు చెబుతున్నారు.

ప్రతీ ఒక్కరికి ఉపయోగపడేలా

ప్రస్తుతం సమాజంలో ప్రతీ ఇంటిలోనూ స్మార్ట్ ఫోన్ వినియోగం ఎక్కువగా కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో నిత్యావసరాల కొనుగోలు నుంచి దానధర్మాల వరకూ ఆర్థిక లావాదేవీలన్నీ ప్రధానంగా గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్‌ల ద్వారా సులభంగా జరుగుతున్నాయి. ఆర్బీఐ భారత్ బిల్ పేమెంట్స్ మార్గదర్శకాల ప్రకారం నేరుగా థర్డ్ పార్టీ యాప్‌ల నుంచి చెల్లింపులను నిలిపేసి సులభమైన పేమెంట్ సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ను సిద్ధం చేసి ప్రజలకు చేరువ చేసింది. ఆన్‌లైన్‌లో వినియోగదారులు ముందుగా గూగుల్ ప్లేస్టోర్‌లో ఈస్ట్రన్ పవర్ యాప్ అని ఎంటర్ చేస్తే సంబంధిత యాప్ కనిపిస్తుంది. దానిని మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. దీని ద్వారా చాలా సులభంగా బిల్లులు చెల్లించవచ్చు. వెబ్‌సైట్ ద్వారా బిల్లులు చెల్లించాలనుకునే వినియోగదారులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఈస్ట్రన్‌పవర్.కామ్ ద్వారా పేమెంట్ చేయవచ్చు. ఇదే యాప్‌లో వినియోగదారులు నెట్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్ కార్డులతో పాటు ఫోన్‌పే, గూగుల్‌పేలను వినియోగించుకునే సదుపాయం కల్పించారు.

> **ప్రతి ఒక్కరూ వినియోగించుకోవచ్చు**
>
> 
>
> ఈస్ట్రన్ పవర్ యాప్‌ను స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతిఒక్కరూ వినియోగించుకోవచ్చు. ఇది చాలా సులభమైన ప్రక్రియ. యాప్‌లో వినియోదారుడికి ఏ నెల ఎన్ని యూనిట్ల విద్యుత్ వినియోగించారో, ఎంత బిల్లు వచ్చిందో స్పష్టంగా తెలుస్తుంది. ఈ మేరకు మా సిబ్బంది ద్వారా వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నాం.
>
> – టి.శ్రీహరి, ఏఈఈ, ఏపీఈపీడీసీఎల్, ఉప్పలగుప్తం మండలం